# నిర్మల

రచన:
శ్రీ పి. వి. సుబ్రమణ్యం.

[కాలచక్రము చాలా విచిత్ర గమనం చేస్తూంటుంది. దాని గమనములో కొందరికి కలలోకూడా అనుకోని సంపదలు చేకూరుతాయి. కొందరికి ·టి ముందున్న పదార్థాన్ని తన్నుకుపోయే భయంకర పక్షిలా మారుతుంది. దాని కంతకు తల వంచటమే మానవ కర్తవ్యం, ఎదిరించి పోరాడే శక్తి లేదు. ఇక చదవండి.]

వెన్నెల రేయి—చిరు నగవులలో చంద్రుడు, వికసించిన తెల్లని మల్లెపూవువలె ప్రకాశించుచున్నాడు. నీలి ఆకాశములో తారకలు మినుకు మినుకుమనుచున్నది. వెన్నెలలో ప్రకృతి తన సొంపును దిద్దుకుంటున్నది.

తొలి రేయి శోభనపు గదిలో అడుగుపెట్టిన కిరణ్ కుమారి సిగ్గుతో తలవంచుకొని హంసలా వెళ్ళి వరండాలోనున్న స్తంభాన్ని తోడుంచుకొని వెన్నెలలోని ఆనందాన్ని నెమరు వేస్తూంది.

చక్కగా పూలతో అలంకరించిన పందిరి మంచముపై పరుండి, ఆ రేయి తాను గడుపు ఆనందాన్ని నెమరువేస్తూన్న రవికుమార్, అడుగుల సవ్వడి విని తన కలలకు సెలవుపెట్టి మెల్లగా ఆమె చెంత చేరి ఆమె బుజముపై చేయివేసి, ముద్దాడపోయాడు. వెంటనే ఏదో షాక్ తిన్నవాడిలాగ ఆమెనుండి రెండడుగులు వెనక్కు తగ్గి,

'నన్ను క్షమించు ... నిన్ను వివాహము చేసుకొని నీకు అన్యాయము చేశాను...నీతో మనసు విప్పి వర్తించలేను'. దుఃఖముతో నుదిటమీద చేయి వేసుకొని పడకమీదకు పోయాడు.

తనపై పగ వహించిన క్రూర విధిని దూషించాడు.

అతని కళ్ళముందు నిర్మలమయిన నిర్మల రూపం కనిపించింది. నిర్మలా అంటూ దిండుపై తల ఆన్చి పిచ్చివానిలా గట్టిగా అరచాడు.

నూతన వధువయిన కిరణ్‌కు ఇదంతా అగమ్యగోచరంగా కన్పించసాగింది. ఏమిచేయాలో పాలుపోలేదు. మనస్సు పరిపరి విధాల ఆలోచనలతో బరువెక్కిపోయింది. తన్ను తాను తమాయించుకొని, మనసును కుదుటపరచుకొనే శక్తి ఆమెకు లేకపోయింది. అడుగులు తడబడ్డాయి, మెల్లగా వెళ్లి రవి పాదాల చెంత కూర్చుంది.—

ఆమె కన్నులనుండి స్రవించిన అశ్రువులు అతని పాదాలు తాకాయి. ఆ కన్నీళ్ళ తాకిడికి అతని శరీరము కంపించింది. మనకు అవ్యక్తమయిన భాద, ఆవేశాలకు లోనైంది. లేచి కూర్చొని ఆమెను తన చేతులలోనికి తీసుకొని 'నన్ను క్షమించు ... కిరణ్ ... నన్ను క్షమించు నీకు ద్రోహము చేశాను' అంటూ వాపోయాడు.

కలతచెందిన ఆమె హృదయము మరీ వికృత స్వరూపము ధరించింది. తనేదో భయంకర సుడిగుండాలమధ్య చిక్కుకొనివున్నట్లు భాదపడింది.

శక్తినంతా కూడతీసుకొని 'ఏమండీ! నేనేమయినా తప్పుచేసివుంటే క్షమించండి.' విషయమేమిటో తెలుపకుండా మీరు లోలోన భాదపడితే నాకేం తెలుసు, నాకెందుకో భయంగా వుంది. చెప్పండి ... నిర్మల ఎవరు! ఎందుకు మీరామెనుగూర్చి అలా భాదపడతారు...!! వెక్కి వెక్కి ఏడ్వసాగింది కిరణ్ కుమారి.

రవి, కిరణ్‌ను ప్రక్కన కూర్చుండబెట్టుకొని దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడచి చెప్పడము మొదలెట్టాడు.

× × ×

ఏడాదిక్రితం నేను కాలేజిలో చదివేరోజులవి. నేనంటే అందరికి కొంతకుకొంత మంచి భావమే వుండేది. క్లాసుకు ఫష్టు రాకపోయినా మంచి మార్కులే వస్తుండేవి.

శెలవుల్లో నేను మావూరు వెళ్ళి పట్నానికి తిరిగి వస్తున్నాను రైలు ప్రయాణం. రైల్లో నేను ఒకవైపు కిటికీ ప్రక్కగా కూర్చున్నాను. 'లోకలు' కావున రైలులో ఎక్కువమంది లేరు. నాప్రక్కగా ఒక గడ్డం సాహెబ్, ఎదురుగా ఒక అమ్మాయి ఏదో నవల చదువుతూ కూర్చుంది. ఇంకా ఇరువురు ఆ ప్రక్కగా

కూర్చొని ఏదో మాట్లాడుకొనుచున్నారు. నేను 'వీక్లీ ప్రభ'ను తిరుగ వేయుచు కూర్చొనియుంటిని.

రాత్రి ఎనిమిది గంటలు కావస్తూంది. రైలు చిన్నగా రెండు స్టేషన్లు దాటింది. అప్పటికే నేనున్న పెట్టెలోని యాత్రికులంతా దిగి వెళ్ళారు. నేను నా ఎదుట కూర్చున్న అమ్మాయి మిగిలాము.

ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమయింది. వర్షం కుండపోతగా కురుస్తోంది. చలి జోరుగా వీస్తోంది.

కొంచెపటికల్లా రైలు ఒక చిన్న స్టేషనులో ఆగింది. కొంచెపటికి వదులుతుందికదా అని అలాగే కూర్చున్నాను. కాని చాలాసేపటికి వదలకపోవటమువలన చాలా చిరాకేసింది. బయటకెళ్దామని లేచాను.

లేస్తూ ఆ అమ్మాయివంక ఓరగా చూశాను. ఆ అమ్మాయి చలికి వణకుతూంది. వణకుతునే నవలను చదువుతూంది. అందమయిన గుండ్రని ముఖం, నల్లటి కనులు, ప్రక్క పాపట తీసి వాలుజడ వేసుకుంది. చామన చాయలోని ఆమె శరీరము రైలులోని లైటు వెలుతురికి అదోలా కనిపిస్తూంది. ఆకుపచ్చరంగు నైలాను చీర, ఎరుపురంగు జాకెట్టు ధరించింది. చెవులకు ఆధునిక మయిన రింగులను ధరించింది.

ఆమె అందమును నెమరువేస్తూ రైలు దిగాను.

అది చాలా చిన్న స్టేషను. ఎక్కడో ఒకరో ఇద్దరో స్టేషనులో నిద్రపోవుచున్నారు. దగ్గరలో ఒక చిన్న హోటలు వుంది.

స్టేషనుమాష్టరును కలుసుకొని రైలు విషయ మడిగాను.

'ఆఫ్ వెనవర్ లేట్ మిస్టర్' అంటూ ఆంగ్లములో సమాధానమిచ్చాడు స్టేషనుమాష్టరు.

సరేనంటూ సరాసరి హోటలువద్దకెళ్ళి నాలుగు బిస్కట్లు తిని ఒక డబుల్ టీ త్రాగాను, అప్పటికి చలిబాధ కొంత తగ్గింది.

రైల్లోని ఆ అమ్మాయి జ్ఞాపకం వచ్చింది. ఎందుకో ఆ అమ్మాయిమీద జాలివేసింది. నాలుగు బిస్కట్లు పొట్లం కట్టించుకొని ఒక టీ చేతపట్టుకొని ఆ అమ్మాయి కూర్చున్న కిటికీవద్దకెళ్ళాను.

ఎలా పలుకరించాలోనని తికమకపడి ధైర్యంచేసి 'ఏమండీ!' అని పిలిచాను.

ఏమన్నట్లు నావైపు చూచింది.

ఏం మాట్లాడాలో తెలియక బిస్కట్ల పొట్లం ఆమెవైపు చూపించాడు.

'అవసరంలేదండీ.' అని తిరిగి చదవడం ప్రారంభించింది.

'పరవాలేదులెండి' చలిగా వుంది, కాస్త టీ పుచ్చుకొండి ప్లీజ్' అంటూ అవి ఆమెకు అందించాను.

గ్లాసు తీసుకొని హోటలుకెళ్ళి బిల్లు చెల్లించి సంతృప్తిగా ఫాంట్ జేబులో చేయివేసుకొని వెనుదిరిగాను. వర్షం కొద్దిగా తగ్గింది. గార్డ్ విజిల్ వినిపించగనే నేవెళ్ళి రైలులో నా సీట్లో కూర్చున్నాను.

రైలు కదిలింది. నేను ధైర్యంచేసి 'మీపేరేమిటండీ' అని అడిగాను.

ఆమె చదువుతూనే 'నిర్మల' అంది నిర్మలంగా.

'ఎందాక వెళ్తున్నారండీ' ఉత్సాహంగా అడిగాను

'వాల్తేరువరకూ......'

'బంధువులు ఎవరైనా వున్నారాండీ...'

'లేరు'

'ఉద్యోగము చేస్తున్నారా...'

'ఉహు...' మామూలుగా సమాధానమిచ్చింది.

'మరి ... ఇంకెందుకెళ్తున్నారండీ ... సంశయంగా అడిగాను.

'చదువుచున్నాను ..'

'ఏమి చదువుచున్నారండీ...'

'ఇంటర్ ...' ముక్కలో క్లుప్తంగా జవాబిచ్చింది. తరువాత కొంతసేపు నిశ్శబ్దము గడచింది. ఆ అమ్మాయి పుస్తకము ప్రక్కన పడేసి 'మీరెందాకా వెళ్తున్నారండీ'...అని తిరిగి ప్రశ్నించింది.

'నేను వాల్తేరువరకే...' మెల్లిగా అన్నాను.

'ఉద్యోగమాండి...'

'లేదు చదువుకోసమే...'

'ఏం చదువుచున్నారండీ...'

'B, Sc'...అన్నాను క్లుప్తంగా.

నిర్మలకు నాకు అలా పరిచయమయింది. ఆ పరిచయమే కొన్నాళ్ళకు ప్రేమగా మారింది. ఒకరనొకరు గాఢంగా ప్రేమించుకున్నాము. వివాహంకోసం ఎదురు చూస్తున్నాము.

నేను ప్రతిదినము నిర్మల ఇంటికెళ్ళేవాన్ని. ఇద్దరము కలసి ప్రతిదినమూ షికారుకెళ్ళేవాళ్ళం.

ఓ ఆదివారం సాయంత్రము నేను నిర్మల షికారుకు బీచ్ వైపు వెళ్ళాము. ఏవేవో కులాసాగా కబుర్లు చెబుతుంటూ అలా సముద్రపుతీరము వెంబడి కొంతదూరము వెళ్ళి నీటిమధ్యవున్న ఓ బండరాయిమీద కూర్చున్నాము.

సంధ్యావేళ, సూర్యుడస్తమిస్తున్నాడు. దూరముగా సముద్రముపై స్టీమరు వెళ్తూంది. సారంగుచేపలు పట్టడం చాలించి బోట్లను గట్టుకుచేర్చే ప్రయత్నంలో ఉన్నారు. దూరంగా రేడియోనుండి హిందీ పాటలు వినిపిస్తూన్నాయి. మెల్ళిగా చంద్రుడు తన కిరణాలను లోకవ్యాప్తము చేస్తున్నాడు. గుంపు గుంపులుగా పక్షులు తమ గూళ్ళకు వెళ్తున్నాయి. దూరముగా ఇసుకతిన్నలపై ప్రేమికుల నవ్వులు వినిపిస్తూన్నాయి.

'నిర్మలా'...అన్నాను మెల్ళిగా ఆమె బుజముపై చేయి వేస్తూ. పిలుపు విన్న నిర్మల నావైపు 'ఊ' అంటూ చూసింది.

సముద్రపు అలలు మేము కూర్చున్న బండరాయి తగిలి చిందరవందరగా అవుచున్నవి. అలలనుండి రేగిన నీటి తుంపరలు నిర్మల శరీరాన్ని పులకరింపచేస్తున్నాయి. మెల్లగా వీస్తున్న మంద పవనాల తాకిడికి చీరకొంగు రెపరెపలాడుచున్నధి. ముఖముమీద పడుతూవున్న వుంగరాలు తిరిగిన ముంగురులను ప్రక్కకు తీస్తూ నా బాహువుల్లోకి ఒరిగిపోయింది.

నిర్మల నావైపు అరమోడ్పు కన్నులతో చూస్తూ 'రవీ...ఈనాడు మన హృదయాలు కలిసి ఆనందాన్ని చవిచూస్తున్న ఈ సంధ్యాసమయం జీవితాంతము వుండాలని నా మనసు ఉవ్విల్లూరుచున్నది. కాని ఎందుకో కీడును శంకించుచున్నది. ఈ సముద్రపు అలల లాగా ఉవ్వెత్తుగా లేచి క్షణంలో మాయమయిపోయిన విధము [illegible] ప్రేమ క్షణికమేమోనని అనవసర ఆలోచనలతో హృదయం బరువెక్కిపోయింది' అంటూ [illegible] డిపోయింది నిర్మల.

[illegible] ఏమిటి నీ పిచ్చి ఊహాలు...అలా ఎన్నటికీ [illegible]గదు నిర్మలా...మన వివాహం తప్పక జరుగుతుంది నిర్మలా...! అందుకే ఈ నెలలోనే మన వివాహం జరగాలని నిశ్చయించుకున్నాను' అంటూ ఆమె బుగ్గ గిల్లాను.

నిర్మల సిగ్గుతో తల వంచుకుంది. అది గమనించక నేను చిరునవ్వు నవ్వి నిర్మలా ఇంకెళ్దాముపద అంటూ బయలుదేరాము.

ఆనెల ఆఖరునే మా వివాహం నిశ్చయమయింది.

రోజులు గడచుచున్నకొలది ముహూర్తదినం దగ్గరవుచున్నది. ఆ రోజు రానేవచ్చింది.

ఇంటిముందు పెళ్ళి పందిరి పెళ్ళివారితో కళకళలాడుతూంది. పందిటి కన్నివైపులా అరటి తోరణాలు కట్టారు. మైకులు మధుర సంగీతాన్ని వినిపిస్తూన్నాయి. విద్యుత్ దీపాలతో పట్టపగలువలె వున్నది పెళ్ళి పందిరి.

నేను వచ్చిన అథితులను గౌరవంగా ఆహ్వానిస్తున్నాను. మానాన్న ఆడ పెళ్ళివారిని ఆహ్వానించుటకు కారులో రైలుస్టేషను కెళ్ళాడు.

రైలు వేగముగా నడుస్తోంది. ఆడుపెళ్ళివారంతా ఒక పెట్టెలో కూర్చున్నారు. అందరి ముఖాలు కళకళలాడుతున్నాయి. వారిమధ్య నిర్మల నిర్మలంగా కూర్చుని ముసిముసి నవ్వులు నవ్వుతుంది.

ఉన్నట్లుండి ఆకాశము మేఘావృతమయింది. గాలి వేగముగా వీస్తోంది. గాలితో పోటీచేస్తున్నట్లు రైలు వేగముగా పరిగెడుతూంది. ఉరుములు భయంకర శబ్దాన్ని చేస్తున్నాయి. మెరుపులు కన్నులు మిరమిట్లు కొలిపేలా మెరుస్తున్నాయి. వర్షం కురవడం మొదలెట్టింది.

దూరాన ఎక్కడో పెద్ద చెట్టు విరిగిపడిన శబ్దమయింది. ఉన్నట్లుండి పెద్ద మెరుపు మెరిసింది. ఆ వెలుగులో భయంకరమయిన చప్పుడుచేస్తూ పిడుగు రైలు పట్టాలమీద పడి దారి చెడింది. రైలు ఒక్క కుదుపుతో తలక్రిందులయింది. ఆహాకారాలు మిన్నుముట్టాయి. ఆ ప్రదేశమంతా భయంకర ప్రళయంగా మారిపోయింది ఒక్క క్షణంలో.

దూరాన్న రైలుస్టేషనునుండి తిరిగివచ్చి రైలు ప్రమాదము విషయము చెప్పాడు. నేను ఆత్రుతగా మా నాన్నతో కలసి ప్రమాద ప్రదేశము చేరాము.

నేను నిర్మలకొరకు వెతకటం ప్రారంభించాను. ఆ ప్రదేశమంతా బురదగా వుంది. అప్పటికే కొందరిని ఆస్పిటలునకు చేర్చుతున్నారు. ఆ ప్రదేశమంతా వెతకగా నిర్మల దూరంగా ఒక చెట్టుప్రక్క పడివుండటం కనిపించింది. పరుగెత్తుకుంటూ నిర్మల పడివున్న చోటికి వెళ్ళాను. నిర్మలను కారులో పరుండబెట్టుకొని ఆస్పిటలుకు చేర్చాను. అప్పటికే తెల్లవారొచ్చింది.

తలకు పెద్ద గాయం తగిలింది నిర్మలకు. డాక్టరు తలకు కట్టుకట్టి ఇంజక్షన్ ఇచ్చి కొంచెము సేపటికి స్పృహ రావచ్చు. అని వెళ్ళిపోయాడు డాక్టరు.

కొంతసేపటికి నిర్మలకు స్పృహ వచ్చింది. నిర్మలా అన్నాను మెల్లిగా. నిర్మల నావైపు చూచింది.

డాక్టర్ మళ్ళీవచ్చి ఇంజక్షన్ ఇచ్చి బయటికి నడిచాడు. నేను డాక్టర్‌ను వెంబడించాను.

'తలకు పెద్ద గాయం తగిలింది, బ్రతకటం కష్టమన్నాడు డాక్టరు.'

'డాక్టర్ ఎలాగైనా నా నిర్మలను బ్రతికించు డాక్టర్ ...బ్రతికించు డాక్టర్'... డాక్టర్ చేతులు పట్టుకున్నాను.

రవి ఖంఠం బొంగురువోయింది.

'ప్రయోజనము లేదంటూ వెళ్ళిపోయాడు' డాక్టరు.

నిర్మల చెంతచేరి 'నిర్మలా'...అన్నాను.

నిర్మల మెల్లిగా 'ర...వీ' అని పిలిచింది.

'నిర్మల'...అన్నాను బొంగురువోయిన ఖంఠముతో.

'రవీ...ఇక నేను బ్రతకటం కష్టము. రవీ... నేను ...చనిపోయాక ... నా ఆత్మ...శాంతి...కొరకు...నీవు మళ్ళీ...వివాహం చేసుకుంటానని మాటివ్వు' అని చేయి చాచింది.

'నిర్మల'...అంటూ రెండు చేతులతో నిర్మల చేయి పట్టుకున్నాను.

నిర్మల మెల్లిగా 'ర...వీ' అంటూ కన్ను మూసింది.

నిర్మల చనిపోయి ఇప్పటికి సంవత్సరముకూడా కాలేదు. నిర్మల ఆత్మశాంతికోసం తిరిగి నిన్ను పెళ్ళాడాను. అని రవి కిరణ్‌కుమారిని తన బాహువుల్లో బిగుచుకున్నాడు.

(10వ పేజీ తరువాయి)

సోఫా వెనక్కి చేరాడు. అక్కడ గుబురుగా చెట్లున్నాయ్. మరుక్షణం ఒక పెద్ద రాయిని వాసు తలమీదకు విసరబోయాడు...

'అమ్మా' అన్న ఆర్తనాదం విన్పించి వాసు ఉలిక్కిపడి సోఫా దిగి వెనక్కి చేరాడు ఏమయిందక్కడ! రాము నోటంట నురగలు క్రక్కుతూ గడ్డిలో పడున్నాడు. అతని శరీరం క్రమేపి నల్లబడ్తోంది. అప్పుడే జరజరా ప్రాకుతూ అతని ప్రక్కనుండి వెళ్ళిందొక పాము.

వాసు,రాము దగ్గరగా వెళ్ళాడు. రామేదో హీనస్వరంతో గొణుగుతున్నాడు. 'నన్ను క్షమించరా, వాసూ! వెనుకనుండి దొంగచాటుగా నిన్ను కొట్టబోయాను అందుకు ప్రతిఫలంగా దేవుడు నాకుయీవిధంగా ప్రాయశ్చిత్తం చేశాడు' రాము శరీరం పూర్తిగా నల్లబడగా, కళ్లు తేలేశాడు. తల ప్రక్కకి వాలిపోయింది.

వాసు కను కొనల్లోంచి అవిరళధారగా భాష్పబిందువులు స్రవించసాగాయ్!


# కథాంజలి

[కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

*

విడి ప్రతి ... 0-25 పై.

సంవత్సర చందా ... రూ. 4-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాతమ్స్, స్టేషన్ బుక్ స్టాల్సులోనూ దొరకును.